క్లుప్తంగా

వైభవంగా జైన్ గుడి ప్రతిష్ట మహోత్సవాలు



పాత గుంటూరు: విద్యానగర్ మూడో లైనులో నూతన జైన్ గుడి ప్రతిష్ట మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం రింగ్ రోడ్డులోని సిద్ధార్థ గార్డెన్స్‌లో జైనుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో ముఖ్య అతిథులుగా రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ పాల్గొన్నారు. జైన్ సంప్రదాయాలతో వారికి స్వాగతం పలికారు. జైన్ గురు మణి ప్రభ్ సూరీజీ గుడి ప్రతిష్ట కార్యక్రమాల్ని వివరించారు. అనంతరం ఎంపీ అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సుక్కిరాజ హుండియా, అశోక్ హుండియా, మహేంద్ర గులేచా, జుగ్రాజ్ భండారి, పలువురు జైనులు పాల్గొన్నారు.

టెన్త్ పాసైన విద్యార్థులకు ఉచిత ఐఐటీ, నీట్ ఫౌండేషన్ తరగతులు

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు మొదటి ప్రయత్నంలోనే ఐఐటీ, నీట్ సాధించడమెలా ? అనే అంశంపై ఈనెల 14 నుంచి ఐదు రోజుల పాటు ఉచిత అవగాహన తరగతుల్ని నిర్వహిస్తున్నట్లు మెటా మైండ్ అకాడమీ డైరెక్టర్ మనోజ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులు, విషయ నిపుణుల ఆధ్వర్యంలో సిలబస్, పరీక్షా విధానం, మెంటార్‌షిప్, టెస్ట్ సిరీస్, ఒత్తిడిని జయించడమెలా, రైటింగ్ స్కిల్స్, సమయపాలన తదితర అంశాలపై ఉచిత తరగతులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. పేర్లు నమోదు చేసుకున్న విద్యార్థులకు హైదరాబాద్ దోమలగూడలోని రామకృష్ణ మఠం వద్ద ఉన్న అకాడమీలో ఐదు రోజుల పాటు ఉచిత హాస్టల్ వసతితో శిక్షణ కల్పిస్తామని తెలిపారు. ఉచిత రిజిస్ట్రేషన్ కోసం 8522958575, 7032264910 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అనాథ విద్యార్థినులకు అభినందనలు



గుంటూరు మెడికల్: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఏ గ్రేడ్ సాధించిన ఏటుకూరులోని అనాథ ఆశ్రమ పిల్లలు బొల్ల భువన, కృతిలను సోమవారం అల్బినా చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు జాలాది సెల్వరాజ్, మేరి అభినందించి, వస్త్రాలు బహూకరించారు. విద్యార్థినుల ఉన్నత చదువుకు ట్రస్టు తరఫున సాయం అందిస్తామని వెల్లడించారు.

కొరిటెపాడు లైబ్రరి సెంటర్‌లో చలివేంద్రం ప్రారంభం



నగరంపాలెం: వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని స్వచ్ఛ హృదయం చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు జొన్నలగడ్డ మార్తమ్మ తెలిపారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో కొరిటెపాడు లైబ్రరి సెంటర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎండ దృష్ట్యా ఇంటి నుంచి బయటకు వచ్చేటప్పుడు కనీస జాగ్రత్తలు తీసుకోవాలని చైర్మన్ రాజమోహన్‌రావు సూచించారు. అనంతరం చలివేంద్రంలో చల్లని నీరుతోపాటు మజ్జిగ కూడా పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి సుజాత, అఖిల్‌రాజ్, జె.యోబు, అభయ్, దైవమణి పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థికి అభినందన



గుంటూరు రూరల్: పదో తరగతి ఫలితాల్లో 584 మార్కులతో మండలంలో ప్రథమ స్థానం సాధించిన జొన్నలగడ్డ జెడ్పీ పాఠశాల విద్యార్థిని గాండ్ల హేమ, ఆమె తండ్రి సత్యనారాయణను సోమవారం పాఠశాలలో ఉపాధ్యాయులు అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.సత్యవాణి, గ్రామ సర్పంచ్ మబ్బు శిరీష, ఉపసర్పంచ్ వంగా నవీన్‌రెడ్డి, విద్యాకమిటీ చైర్మన్ మధు, ఉపాధ్యాయులు విద్యార్థిని, ఆమె తండ్రిని సన్మానించారు.

ప్రజల సమస్యలపై తక్షణ స్పందన: మేయర్

'డయల్ యువర్ మేయర్' కార్యక్రమం ప్రారంభం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, ఎమ్మెల్యేలు ముస్తఫా, మద్దాళి గిరిధర్, మేయర్ కావటి, కమిషనర్ కీర్తి

నెహ్రూనగర్: నగర ప్రజల సమస్యల పరిష్కారానికి గానూ వారికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. మేయర్ చాంబర్‌లో సోమవారం డయల్ యువర్ మేయర్ కార్యక్రమ పోస్టర్‌ను ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, ఎమ్మెల్యేలు మొహమ్మద్ ముస్తఫా, మద్దాళి గిరిధర్, నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని 57 డివిజన్లలోని ప్రజలు తమ ప్రాంతాల్లోని చిన్న చిన్న సమస్యల వల్ల ఇబ్బందులు పడుతున్నారని తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. వాటి పరిష్కారానికి గానూ డయల్ యువర్ మేయర్ అనే కార్యక్రమాన్ని చేపడుతున్నామని చెప్పారు. ప్రజల స్థానిక, మౌలిక సదుపాయాల సమస్యల పరిష్కారానికి 9849908384 నంబర్‌కు ఫిర్యాదు చేస్తే, సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించడానికి కృషి చేస్తామని మేయర్ పేర్కొన్నారు.

'స్పందన' ఫిర్యాదులకు సకాలంలో పరిష్కారం

అధికారులకు నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశం



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: స్పందనలో ప్రజల నుంచి సమస్యలపై అందే ఫిర్యాదుల్ని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని, నిర్లక్ష్యంగా ఉండే అధికారులు, సచివాలయ కార్యదర్శులపై శాఖాపరమైన చర్యలు తప్పవని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత గతవారం ఫిర్యాదుల పరిష్కారం, స్పందన పోర్టల్, ఈఆర్‌పీ, వాట్సాప్, కాల్ సెంటర్ల ద్వారా అందిన ఫిర్యాదులపై అధికారులు, సంబంధిత కార్యదర్శులతో సమీక్షించారు. ప్రజల సమస్యల్ని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. సోమవారం నిర్వహించిన స్పందనలో 45 ఫిర్యాదులు అందాయని చెప్పారు. ఇందులో పట్టణ ప్రణాళిక విభాగానికి 18, ఇంజినీరింగ్ విభాగానికి 13, రెవెన్యూ విభాగానికి ఆరు, ఉపా సెల్ విభాగానికి ఒకటి, అకౌంట్స్ విభాగానికి ఒకటి, పరిపాలన విభాగానికి ఆరు చొప్పున అందాయని, వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారుల్ని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.రోజా, డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, ఎస్ఈ భాస్కర్, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంహెచ్ఓ డాక్టర్ భానుప్రకాష్, ఏడీహెచ్ రామారావు, బయాలజిస్ట్ మధుసూదన్, మేనేజర్ శివన్నారాయణ, ఉపా సెల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రేపటి నుంచి హనుమత్ జయంత్యుత్సవాలు



గోడ ప్రతులను ఆవిష్కరిస్తున్న ఈవో శ్రీనివాసరావు, చైర్మన్ జయప్రకాష్‌రెడ్డి తదితరులు

పాత గుంటూరు: కొత్తపేటలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో ఈ నెల 10వ తేదీ నుంచి 14 వరకు హనుమత్ జయంత్యుత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఈవో డి. శ్రీనివాసరావు తెలిపారు. దేవస్థానం ఆవరణలో సోమవారం ఉత్సవాల గోడప్రతులు, బుక్‌లెట్స్ ఆవిష్కరించారు. ఈవో మాట్లాడుతూ 10న అంకురార్పణ, 11న లక్ష తులసి పూజ, 12న లక్ష మల్లెల పూజ, 13న లక్ష ఆకు పూజ, రాత్రి గ్రామోత్సవం, 14న సహస్ర ఘటాభిషేకం, రాత్రి శ్రీ సువర్చలాంజనేయస్వామి కల్యాణం, 15న అన్నదానం నిర్వహిస్తున్నట్లు వివరించారు. భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జయప్రకాష్‌రెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు విశాలాక్షి, వెంకటజ్యోతి, నరేష్ కుమార్, హనుమాన్ దీక్ష సమాజం లీగల్ అడ్వైజర్ జూపూడి రంగరాజు, అధ్యక్షుడు తిరువల్లూరి వెంకట సుబ్బారావు, సభ్యులు అనిల్ కుమార్, నాగేశ్వరరావు, వెంకట రమణ, వంశీ ప్రసాద్, జనసేన నగర అధ్యక్షుడు ఎన్. సురేష్, బీజేపీ నేత డాక్టర్ ఉమా శంకర్ పాల్గొన్నారు.

గురుకుల విద్యాలయాల్లో అద్భుతమైన ఫలితాలు



నరసింహారావును సత్కరిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణ రావు, మల్లేశ్వర్, మధుసూదనరావు

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ (ఏపీఆర్ఈఐఎస్) యాజమాన్యంలోని పాఠశాలలు అద్భుతమైన ఫలితాల్ని సాధించడం అభినందనీయని ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు పేర్కొన్నారు. కొరిటెపాడులోని సంస్థ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం డైరెక్టర్ ఆర్. నరసింహారావును ఆయన కలిశారు. టెన్త్‌లో అత్యధికంగా 95.25 శాతం ఉత్తీర్ణత నమోదైన సందర్భంగా శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో గురుకుల విద్యాలయాల సంస్థ ఉపాధ్యాయ సంఘ నాయకులు డి. మధుసూదనరావు, పి.వి.మల్లేశ్వర్ పాల్గొన్నారు.

విజ్ఞాన్ వర్సిటీ అధ్యాపకుడికి పీహెచ్‌డీ



శివకోటేశ్వరరావుకు పీహెచ్‌డీ పట్టాను అందజేస్తున్న విజ్ఞాన్ వీసీ నాగభూషణ్

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ చిన్నం శివ కోటేశ్వరరావుకు తమ యూనివర్సిటీ సీఎస్ఈ విభాగంలో సోమవారం పీహెచ్‌డీ పట్టా అందించిందని వర్సిటీ వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ తెలిపారు. మల్టీ మోడల్ అటెన్షన్ కాస్కేడ్ యూనెట్ ఆర్కిటెక్చర్ ఫర్ 3డీ బ్రెయిన్ ట్యూమర్ సెగ్మెంటేషన్ అనే అంశంపై ఆయన పరిశోధన చేశారని వివరించారు. పరిశోధనలో భాగంగా మొత్తం 2 ఎస్‌సీఐ, 2 ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ పేపర్లు పబ్లిష్ చేశారని వెల్లడించారు. పీహెచ్‌డీ పట్టా పొందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ చిన్నం శివకోటేశ్వరరావును పలువురు అభినందించారు.

మనబడి నాడు-నేడు పనులు సకాలంలో పూర్తిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ కెనడీ

కాకుమాను: మండలంలోని గ్రామాలలో మనబడి నాడు-నేడు రెండోదశ ద్వారా జరుగుతున్న ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని ఎంఈఓ కెఎఫ్ కెనడీ చెప్పారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో సోమవారం మనబడి నాడు-నేడు రెండో దశ పనులపై హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసి విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలనే లక్ష్యంతో మనబడి నాడు-నేడు అనే పథకాన్ని చేపట్టి పాఠశాలల రూపు రేఖలను మారుస్తున్నట్లు ఆయన తెలిపారు. ఫేజ్-2 ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనులు పాఠశాలలు ప్రారంభం నాటికల్లా పూర్తి చేయాలని ఆయన సూచించారు. సమావేశంలో పంచాయతీ రాజ్ ఏఈ ఆనందరావు పాల్గొన్నారు.

రాజధానిపై మాట తప్పిన వైఎస్సార్ సీపీ

- బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పాతూరి నాగభూషణం
- వైఎస్సార్ సీపీ పాలనపై బీజేపీ చార్జిషీట్ విడుదల

గుంటూరు మెడికల్: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి రాజధానిపై మాట తప్పారని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పాతూరి నాగభూషణం ఆరోపించారు. వైఎస్సార్ సీపీ ఎన్నికల హామీల్ని నెరవేర్చడంలో విఫలమైందని తెలిపారు. గుంటూరు బ్రాడీపేటలోని గ్రాండ్ నాగార్జున హోటల్‌లో సోమవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాటిబండ్ల రామకృష్ణ అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. పాతూరి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా కంఠక పాలన సాగుతోందన్నారు. తమ పార్టీ గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు వైఎస్సార్ సీపీ అక్రమాలపై చార్జ్‌షీట్ విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో సర్పంచుల పరిస్థితి దుర్భరంగా ఉందని, వారికి నిధులతో పాటు విధుల్లేవని వెల్లడించారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర పబ్లిసిటీ అండ్ లిటరేచర్ ప్రముఖ్ పాలపాటి రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శులు రాచుమల్లు భాస్కర్, కుమార్‌గౌడ్, అప్పిసెట్టి రంగా, తూర్పు నియోజకవర్గ కో-కన్వీనర్ వనమా నరేంద్ర, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు ధారా అంబేద్కర్, తానుచింతల అనిల్, రాష్ట్ర మీడియా కోకన్వీనర్ వెలగలేటి గంగాధర్ పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: మహిళ ఆత్మహత్యపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. ముత్యాలరెడ్డినగర్‌లో నివసించే గంగూరి శ్రీనివాసరావు భార్య అరుణ (44) తీవ్ర అనారోగ్యంతో బాధపడుతోంది. కడుపు నొప్పి తాళలేక సోమవారం ఇంట్లో ఫ్యానుకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గురుద్రోహి సన్యాస దీక్ష రద్దు



పాత గుంటూరు: తన వద్ద సన్యాస దీక్ష తీసుకున్న సాంబశివానంద భారతి(అలవలపాటి రామ్మోహన్) తమ పీఠ ప్రతినిధి అని అసత్య ప్రచారం చేస్తున్నారని, అది వాస్తవం కాదని శ్రీ శృంగేరి విరూపాక్ష పీఠాధిపతులైన గంభీరానంద భారతీస్వామి తెలిపారు. అరండల్‌లోని శృంగేరి విరూపాక్ష పీఠంలో సోమవారం విలేకరుల సమావేశంలో స్వామి మాట్లాడారు. పరమపూజ్య శ్రీ కుర్తాళం పీఠాధిపతుల గురించి అసత్య ప్రచారం చేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. గురుద్రోహం, హిందూ ధర్మ విరుద్ధమైన పనులు చేస్తున్న సాంబశివానంద భారతి సన్యాస దీక్షను రద్దు చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. నేటి నుంచి అతనికి, తమ పీఠానికి ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. పీఠం పేరును అతను ఉపయోగిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని భారతీస్వామి వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గుంటూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన ఘటన సోమవారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసరావు కథనం ప్రకారం లాలుపురం గ్రామానికి చెందిన తోట పుల్లారావు తన ద్విచక్రవాహనంపై విజయవాడవైపుగా హైవేలో వెళుతున్నాడు. ఈ క్రమంలో వేగంగా నడుపుతుండగా ఎదురుగా విజయవాడవైపు వెళుతున్న కారును వెనుకనుంచి ఢీకొన్నాడు. ప్రమాదంలో పుల్లారావుకు గాయాలు కావటంతో స్థానికులు అతనిని 108లో జీజీహెచ్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. ఆస్పత్రిలో పరీక్షించిన వైద్యులు క్షతగాత్రుని పరిస్థితి బాగానే ఉందని తెలిపారు. ఘటనపై నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గుర్తుతెలియని వృద్ధురాలి మృతి



వృద్ధురాలి మృతదేహం

గుంటూరు రూరల్: గుర్తు తెలియని సుమారు 70 ఏళ్ల వృద్ధురాలు మృతి చెందిన ఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. సీఐ శ్రీనివాసరావు కథనం ప్రకారం పెదపలకలూరు గ్రామం ఎల్ఐసీ కాలనీ నుంచి గోర్లవారిపాలెం వెళ్ళే రోడ్డులో నారాయణ కళాశాల సమీపంలో వృద్ధురాలు మృతి చెందిందని సమాచారం మేరకు పోలీసులకు స్థానికులు సమాచారం అందించటంతో ఘటన స్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించామని పేర్కొన్నారు. మృతుదేహంపై కాషాయం రంగు చీర ధరించి ఉందని వివరించారు. వివరాలు తెలిసిన వారు 8688831607 సెల్ నంబర్‌కు గానీ నేరుగా పోలీస్ స్టేషన్‌లోగానీ సంప్రదించాలని సూచించారు.

ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నాయుడు ధను

పెదకాకాని: పెదకాకాని మండల ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలలో అధ్యక్షుడిగా నాయుడు ధనుంజయరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలోనూ ఆయన పెదకాకాని వర్తక సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా పనిచేశారు. ప్రస్తుతం డివిజనల్ లీగల్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్‌గా పనిచేస్తున్న నాయుడు ధనుంజయరావు గతంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యంగా కోవిడ్-19 సమయంలో ఇతర రాష్ట్రాల కూలీలు సురక్షితంగా ఇంటికి చేరడంలో విశేషంగా కృషి చేశారు. కమిటీ ఆధ్వర్యంలో ఇతర రాష్ట్రాలకు వెళ్ళే ప్రయాణికులకు వారి రాష్ట్రానికి వెళ్ళే రైలు వచ్చే వరకూ అపరకర్మల సత్రంలో ఆశ్రయం కల్పించడంతో పాటు ఉచితంగా ఆహారం, తాగునీరు ఏర్పాటు పలువురి మన్ననలు పొందారు. పెదకాకాని మండల ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కొత్త కమిటీలో ప్రధాన కార్యదర్శిగా వైఎస్ఆర్ కామేశ్వరరావు, కోశాధికారిగా తడవర్తి అప్పారావు, కార్యదర్శులుగా రేఖా ప్రసాదరావు, బంద్రెడ్డి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా కనమర్లపూడి శ్రీకృష్ణ, షేక్ ఆరిఫ్‌లు, సత్రం నిర్వాహకులుగా నల్లూరి శేషగిరిరావు, లింగంగుంట సాల్మన్‌రాజు ఎన్నికయ్యారు.

వేసవి శిక్షణ శిబిరాలతో విద్యార్థుల మేధస్సుకు పదును



శిబిర పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

గుంటూరు ఎడ్యుకేషన్: వేసవి శిక్షణ శిబిరాల ద్వారా విద్యార్థుల మేధస్సును అభివృద్ధి పరచి, విజ్ఞానాన్ని పెంపొందించవచ్చని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు తెలిపారు. అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని సోమవారం రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్‌తో కలసి ఎమ్మెల్సీ లక్ష్మణరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చైతన్యవంతమైన సమాజానికి విజ్ఞానమే కొలబద్ద అని, ఎవరికైనా విజ్ఞానమే విలువైన ఆస్తి అవుతుందని పేర్కొన్నారు. ధన, కనక, వస్తు, వాహనాల్ని దోచుకోవడం సాధ్యమవుతుందని, జ్ఞాన సంపదను ఎవరూ కొల్లగొట్టలేరని స్పష్టం చేశారు. ఆ జ్ఞాన సంపదను అందరికీ పంచి పెట్టాలనే సదుద్దేశంతో జిల్లా గ్రంథాలయ సంస్థ వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. ప్రత్యేకించి చిన్నారులు ప్రస్తుత వేసవి సెలవుల్ని వృథాగా గడపకుండా తమకు తెలియని ఎన్నో కొత్త విషయాలను ఆకళింపు చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు మాట్లాడుతూ, గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను క్రమం తప్పకుండా సందర్శిస్తూ జ్ఞానాన్ని సముపార్జించుకోవాలని కోరారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ మాట్లాడుతూ చిన్నారులకు పుస్తక పఠనంపై ఆసక్తి పెంచేలా చేయడంతో పాటు భావి భారత పౌరుల్ని విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దేందుకే ఉచిత వేసవి విజ్ఞాన శిబిరం ఏర్పాటు చేశామని చెప్పారు. అనేక అంశాలపై వారికి సమగ్ర అవగాహనతో పాటు వారాంతపు పోటీలు నిర్వహించి ప్రోత్సాహక బహుమతులు కూడా అందించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ, శ్రీవల్లి, బూసి రాజలత, అంబేడ్కర్, బోడపాటి ఉషా కిశోర్, గీతా మందిరం చైర్మన్‌వెలుగూరి రత్నప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఝాన్సీలక్ష్మి, ఉద్యోగులు సీతారామయ్య, బ్రహ్మయ్య, లైబ్రేరియన్లు నాగిరెడ్డి, దుర్గారెడ్డి, చిన్నపరెడ్డి, కంపా శ్రీను, వైఎస్సార్ సీపీ నాయకులు మాదాసు కిరణ్, ఆలా కిరణ్, గిరి రాము, మాదాసు భాగ్యారావు, రెడ్డి కోటేశ్వరరావు, కొత్తపేట సతీష్, అరవ తిమ్మరాజు, వాసిమళ్ల విజయ్ పాల్గొన్నారు.

ఏపీపీఎస్సీ సభ్యురాలు సెలీనాకు అభినందనలు



డాక్టర్ సెలీనాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏసీ కళాశాల ప్రిన్సిపాల్ మోజెస్, అధ్యాపకులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) సభ్యురాలిగా డాక్టర్ బీఎస్ సెలీనా నియామకంపై ఏసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొమ్మాలపాటి మోజెస్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం మంగళగిరిలోని రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాలయంలో అకడమిక్ అధికారిగా పని చేస్తున్న సెలీనాను కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మోజెస్ మాట్లాడుతూ ఏసీ కళాశాల పూర్వ విద్యార్థిని అయిన డాక్టర్ బీఎస్ సెలీనాను సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఏపీపీఎస్సీ సభ్యురాలిగా నియమించడం ద్వారా విద్యారంగంలో ఆమె సాధించిన అపారమైన అనుభవానికి తగిన గుర్తింపు ఇచ్చారని తెలిపారు. సెలీనా తండ్రి బి. చంద్రపాల్ ఏసీ కళాశాల ప్రిన్సిపాల్‌గాను, ఆమె తల్లి సూజన్ ప్రమీల బోటనీ అధ్యాపకురాలిగా పని చేశారని చెప్పారు. ఈసందర్భంగా డాక్టర్ సెలీనాకు కళాశాల కరస్పాండెంట్, మోడరేటర్ బిషప్ డాక్టర్ కేఎఫ్ పరదేశిబాబు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ ఎం.ఎస్ శ్రీధర్, అధ్యాపకులు ప్రీతం ప్రకాష్, ఎజ్రా విజయశేఖర్, పీఎం వినయతేజ పాల్గొన్నారు.

స్థిరమైన లక్ష్యంతోనే సివిల్స్‌లో విజయం



శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న అశ్విన్ మణిదీప్

గుంటూరు ఎడ్యుకేషన్: స్థిరమైన లక్ష్యం, కృషి, పట్టుదలతో సివిల్స్‌లో విజయం తథ్యమని ఐఆర్ఎస్ అధికారి అశ్విన్ మణిదీప్ పేర్కొన్నారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ కార్యాలయంలో కేవీఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, స్టూడెంట్ యూనియన్ ఫర్ నేషన్ (సన్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఐఏఎస్ ఫౌండేషన్ తరగతుల్లో భాగంగా సోమవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సివిల్స్‌కు సన్నద్ధతలో పాటించాల్సిన విధానాలు, సమకాలీన అంశాల గురించి వివరించారు. ఈనెల 16వ తేదీ వరకు తరగతుల్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సన్ నిర్వాహకులు కె.సాయికుమార్, సీహెచ్. బాలు, ఎం. అజయ్, పీర్ సాహెబ్ పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ ద్వారా దేశభక్తి



శిక్షణ ముగింపు సమావేశంలో కమిషనర్ పార్వతి, కమల్ కనన్ తదితరులు

చేబ్రోలు: చేబ్రోలులోని ప్రెసిడెన్సీ హైస్కూల్‌లో జరుగుతున్న స్కౌట్స్ అండ్ గైడ్స్ తృతీయ సోపానం, రాజ్యపురస్కార్ ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం సోమవారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ పి.పార్వతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు రెండు వందల మంది స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు పాల్గొన్నారు. పి.పార్వతి మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశభక్తిని, క్రమశిక్షణను పెంచి వారిని సమాజ సేవకులుగా తీర్చిదిద్దటమే స్కౌట్స్ అండ్ గైడ్స్ ముఖ్య ఉద్దేశమన్నారు. తమిళనాడుకు చెందిన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఎస్వోసీ కమల్ కనన్ మాట్లాడుతూ సదా సమాజసేవలో ఉంటాం అనే నినాదంతో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్టు పేర్కొన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన గుమ్మా నాగలక్ష్మి, సాయి శ్రీహాసినిలకు పార్వతితోపాటు స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రతినిధులు మెమెంటోలు అందజేసి, అభినందించారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ వాసిరెడ్డి బన్‌బాబు, స్కౌట్స్ అండ్ గైడ్స్ నేషనల్ జాయింట్ డైరెక్టర్ డీఆర్‌కే శర్మ, స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిషనర్ పి.శ్రీనివాసరావు, అసోసియేషన్ సెక్రటరీ డీఎల్ నారాయణ, ప్రిన్సిపాల్ ఆశాలత పాల్గొన్నారు.

హెన్రీ డునాంట్ ఆశయ సాధనకు కృషి

రెడ్ క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ రామచంద్రరాజు



సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్రరాజు

పాత గుంటూరు: సామాజిక సేవా రంగంలో నాలుగు సార్లు నోబుల్ బహుమతి పొందిన ఏకైక సంస్థ రెడ్ క్రాస్ మాత్రమేనని జిల్లా వైస్ చైర్మన్ శ్రీ పి రామచంద్రరాజు తెలిపారు. వరల్డ్ రెడ్ క్రాస్ డే సందర్భంగా బ్రాడీపేట మాస్టర్ మైండ్స్ విద్యా సంస్థలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా ప్రకృతి విపత్తుల నష్ట నివారణ, రక్తదాన శిబిరాల నిర్వహణ, ప్రథమ చికిత్స శిబిరాల ఏర్పాటు వంటి అంశాల్లో రెడ్ క్రాస్ విశిష్ట సేవలు అందిస్తోందని చెప్పారు. రెడ్ క్రాస్ వ్యవస్థాపకులు శ్రీ హెన్రీ డునాంట్ ఆశయ సాధనకు అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. మాస్టర్ మైండ్స్ విద్యాసంస్థల అధినేత మట్టుపల్లి మోహన్ మాట్లాడుతూ రెడ్ క్రాస్ సంస్థకు సభ్యునిగా ఉండటం గర్వంగా భావిస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా యూత్ రెడ్ క్రాస్ కన్వీనర్ ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ, రెడ్ క్రాస్ జిల్లా కోశాధికారి ఏ. రవి శ్రీనివాస్, మాస్టర్ మైండ్స్ ప్రతినిధి కోటేశ్వరరావు, రెడ్ క్రాస్ వలంటీర్స్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.